RNI NO APTEL/2012/53127 TELANGANA VANI TELUGU DAILY
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక The Voice of Telangana
శనివారం , 22 - 8 -2026

# ఇందిరమ్మ ఇళ్ల పేరుతో లబ్ధిదారులను గందరగోళపరచొద్దు

### ఎల్1, ఎల్2, ఎల్3 సర్వేల పేరుతో కాలయాపన తగదు

### వెన్నెలనగర్‌లో 500 మందికి ఒకేసారి ఇళ్లు మంజూరు చేయాలి: జలాల్



కొత్తగూడెం, ఆగస్టు 21 (తెలంగాణ వాణి):
ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత ఎంపిక ప్రక్రియలో ప్రభుత్వం కాలయాపన చేస్తోందని సేవ్ కొత్తగూడెం సేవ్ కార్పొరేషన్ కన్వీనర్, ఆవాజ్ పట్టణ కార్యదర్శి జలాల్ విమర్శించారు. కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలో రెండో విడత ఇళ్ల మంజూరు పేరుతో మళ్లీ సర్వేలు నిర్వహించడం సరికాదన్నారు. గతంలోనే లబ్ధిదారుల ఎంపిక పూర్తిచేసి ఎల్1, ఎల్2, ఎల్3 విభాగాలుగా విభజించినప్పటికీ, మళ్లీ సర్వేల పేరుతో ప్రజలను గందరగోళానికి గురిచేస్తున్నారని ఆయన అన్నారు. మొదటి విడత ఇళ్ల నిర్మాణాలు ప్రారంభమై ఏడాది గడుస్తున్నా రెండో విడత ఇళ్ల మంజూరులో జాప్యం చేయడం తగదని పేర్కొన్నారు.
లబ్ధిదారులను తికమక పెట్టకుండా ఎంపిక ప్రక్రియను త్వరగా పూర్తి చేసి ఇళ్ల మంజూరు చేపట్టాలని జలాల్ డిమాండ్ చేశారు. ముఖ్యంగా వెన్నెలనగర్‌లో మిగిలి ఉన్న 500 మంది లబ్ధిదారులకు ఈ విడతలోనే ప్రాధాన్యత ఇచ్చి, ఒకేసారి ఇళ్ల నిర్మాణం జరిగేలా మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేదలకు న్యాయం జరిగేలా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని ఆయన ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

# రూ.12 కోట్లతో పోస్టాఫీస్ -హేమచంద్రాపురం రోడ్డు పనులు

### కూనంనేని చొరవతో అభివృద్ధి పనులకు మోక్షం

### త్వరలో ప్రారంభం కానున్న డబుల్ రోడ్డు నిర్మాణం.. సింగరేణి పరిధిలో టెండర్లు పూర్తి



కొత్తగూడెం, ఆగస్టు 21 (తెలంగాణ వాణి):
కొత్తగూడెం నియోజకవర్గ పరిధిలోని పోస్టాఫీస్ సెంటర్ నుంచి శేషగిరినగర్ మీదుగా హేమచంద్రాపురం వరకు రూ.12 కోట్ల వ్యయంతో చేపట్టనున్న రోడ్డు వెడల్పు, డబుల్ రోడ్డు నిర్మాణ పనులకు టెండర్ ప్రక్రియ పూర్తయింది. దీంతో త్వరలోనే పనులు ప్రారంభించేందుకు సింగరేణి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. సింగరేణి భారీ వాహనాల రాకపోకల కారణంగా ఈ మార్గంలోని రహదారి తీవ్రంగా దెబ్బతినడంతో వాహనదారులు, స్థానిక ప్రజలు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్యను గుర్తించిన ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు రహదారి పునర్నిర్మాణానికి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. సింగరేణి ఉన్నతాధికారులతో పలుమార్లు సమావేశమై రోడ్డు అభివృద్ధి ఆవశ్యకతను వివరించి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఎమ్మెల్యే కూనంనేని కృషికి స్పందించిన సింగరేణి యాజమాన్యం రోడ్డు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయడంతో పాటు టెండర్ ప్రక్రియను పూర్తి చేసింది. అవసరమైన అనుమతులు పూర్తికావడంతో త్వరలో డబుల్ రోడ్డు నిర్మాణ పనులు క్షేత్రస్థాయిలో ప్రారంభం కానున్నాయి. రోడ్డు నిర్మాణం పూర్తయితే పోస్టాఫీస్ సెంటర్ నుంచి హేమచంద్రాపురం వరకు రాకపోకలు సులభతరం కావడంతో పాటు ట్రాఫిక్ రద్దీ తగ్గనుంది. గుంతలు, దుమ్ము సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే కూనంనేని చొరవపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. త్వరలోనే పనులు ప్రారంభించి, నిర్ణీత గడువులోగా నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేసేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానని తెలిపారు. నియోజకవర్గంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు.

# తల్లిదండ్రులు తమ సంతానానికి చక్కని చదువు, సంస్కారం నేర్పాలి

### సంతానం దేవుడు ఇచ్చిన గొప్ప వరం: అబ్దుల్ బాసిత్



కొత్తగూడెం, ఆగస్టు 21 (తెలంగాణ వాణి):
తల్లిదండ్రులు తమ సంతానానికి అందించే గొప్ప ఆస్తి చక్కని విద్య, మంచి సంస్కారమేనని మోడ్రన్ ఇఖ్రా స్కూల్ కరస్పాండెంట్ షేక్ అబ్దుల్ బాసిత్ అన్నారు. పవిత్ర శుక్రవారం సందర్భంగా చుంచుపల్లి మండలం రుద్రంపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని మస్జిద్-ఎ-ఖుబాలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చదువు అంటే కేవలం మార్కులు, ర్యాంకులు సాధించడం మాత్రమే కాదని, విద్యార్థులకు మంచి సంస్కారం, నైతిక విలువలు నేర్పించడమే నిజమైన విద్య అని అన్నారు. పెద్దల పట్ల గౌరవం, వినయం, ముఖ్యంగా విద్యాబుద్ధులు నేర్పి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసే ఉపాధ్యాయుల పట్ల గౌరవభావం పెంపొందించేలా తల్లిదండ్రులు పిల్లలను తీర్చిదిద్దాలని సూచించారు. తల్లిదండ్రుల అతిగారాబం, భోగలాలసలు పిల్లల ప్రవర్తనపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల నల్గొండ జిల్లాలో చోటుచేసుకున్న ప్రిన్సిపాల్ హత్య ఘటన సమాజానికి ఆందోళన కలిగించే విషయమని పేర్కొన్నారు. ఇకనైనా తల్లిదండ్రులు తమ పిల్లల దినచర్య, స్నేహాలు, ప్రవర్తనపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. పాఠశాలల్లో చిన్ననాటి నుంచే విద్యార్థులకు నైతిక విలువలు, మానవతా దృక్పథం, సామాజిక బాధ్యతను బోధించేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని అబ్దుల్ బాసిత్ కోరారు. మానవతా విలువలు, సమాజం పట్ల బాధ్యత లేని విద్య విద్యార్థుల భవిష్యత్తుతో పాటు సమాజంపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతుందని అన్నారు.
విద్యా వ్యవస్థలో నైతిక విలువలకు ప్రాధాన్యం పెంచేందుకు మేధావులు, తల్లిదండ్రులు, విద్యావేత్తలు కలిసి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మసీదు అధ్యక్షుడు అజీజ్ ఖాన్, సోనుభాయ్, షబ్బీర్, అన్వర్, ఖరీం, అజ్గర్, షమీం తదితరులు పాల్గొన్నారు.

# టీసీసీ 13వ వార్షికోత్సవాన్ని విజయవంతం చేయాలి



తల్లాడ, ఆగస్టు 21 (తెలంగాణ వాణి):
తెలంగాణ క్రిస్టియన్ కౌన్సిల్ (టీసీసీ) 13వ వార్షికోత్సవాన్ని విజయవంతం చేయాలని టీసీసీ తల్లాడ మండల అధ్యక్షుడు బ్రదర్ కె. ఇశ్రాయేలు పిలుపునిచ్చారు. గురువారం తల్లాడలో నిర్వహించిన టీసీసీ సమావేశంలో ఆయన మాట్లాడుతు నేడు ఖమ్మంలోని మంచి కంటి భవన్‌లో టీసీసీ 13వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి ఆహ్వానాలు పంపినట్లు వెల్లడించారు. వారితో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు కూడా హాజరయ్యే అవకాశం ఉందని తెలిపారు. వార్షికోత్సవ సమావేశంలో టీసీసీ భవిష్యత్ కార్యాచరణ, సంస్థ అనుసరించాల్సిన విధివిధానాలపై విస్తృతంగా చర్చించనున్నట్లు ఇశ్రాయేలు పేర్కొన్నారు. ఇప్పటివరకు టీసీసీ సాధించిన విజయాలను సమీక్షించడంతో పాటు రానున్న రోజుల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి టీసీసీ బాధ్యులు, క్రైస్తవులు అధిక సంఖ్యలో హాజరై వార్షికోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో టీసీసీ తల్లాడ మండల సెక్రటరీ జి. దేవసహాయం, జిల్లా నాయకుడు గుంటి బాబురావు తదితరులు పాల్గొన్నారు.

# తీజ్ వేడుకలకు శ్రీకారం చుట్టడం శుభపరిణామం




### ఉమ్మడిగా పండుగలు జరుపుకోవడం బంజారాల ఆనవాయితీ

### తీజ్ వేడుకల్లో ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్‌రెడ్డి

కొత్తగూడెం, ఆగస్టు 21 (తెలంగాణ వాణి):
బంజారాల సంప్రదాయ పండుగల్లో ఒకటైన తీజ్ వేడుకలను ఉమ్మడిగా నిర్వహించేందుకు బంజారా సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) శ్రీకారం చుట్టడం శుభపరిణామమని ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. బంజారా సంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ బానోత్ వీరునాయక్ ఆధ్వర్యంలో కొత్తగూడెం పట్టణంలోని ప్రగతి మైదానంలో నిర్వహిస్తున్న తీజ్ వేడుకలను శుక్రవారం ఎమ్మెల్సీ సందర్శించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 15వ తేదీ నుంచి తొమ్మిది రోజుల పాటు తీజ్ వేడుకలను వైభవంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. బంజారాలంతా ఉమ్మడిగా పండుగలు జరుపుకోవడం పూర్వకాలం నుంచి వస్తున్న సంప్రదాయమని తెలిపారు. పట్టణీకరణ పెరగడంతో ఎవరికి వారు పండుగలు నిర్వహించుకోవడం వల్ల సమాజంలో ఐక్యత కొంత లోపించినట్లు అనిపించేదని, అయితే జేఏసీ ఆధ్వర్యంలో తీజ్ వేడుకలను ఉమ్మడిగా నిర్వహించడం ద్వారా బంజారాలంతా ఒకే వేదికపైకి రావడం సంతోషకరమన్నారు. ఇలాంటి కార్యక్రమాలు బంజారా సంస్కృతి, సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. ఎమ్మెల్సీతో పాటు పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంకర బిక్షం గౌడ్, జిల్లా అధ్యక్షులు నరసయ్య, ప్రభాకర్, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు భాస్కర్, రవీందర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోహన్, జిల్లా ఉపాధ్యక్షులు రామారావు, ఈశ్వర్, రమేష్ తదితరులు తీజ్ వేడుకలను సందర్శించి జేఏసీ కృషిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ లాల్‌సింగ్, జేఏసీ జిల్లా నా యకులు రమేష్ రాథోడ్, ధరావత్ కాన్షీరామ్, బానోత్ రమేష్, గుగులోత్ కేశవ్, బాలకృష్ణ, గుగులోత్ భద్రు, జె.బి. బాలు, ధరావత్ కృష్ణ, భూక్య బాబులాల్, రుక్మిణి, ఘంసీ, రమేష్, మురళి, భరత్, సోషల్ మీడియా వినోద్, భూక్య రవికుమార్ పాల్గొన్నారు.

# జిల్లా వ్యాప్తంగా ఘనంగా వరలక్ష్మీ వ్రత పూజలు

### - భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించిన మహిళలు





కొత్తగూడెం, ఆగస్టు 21 (తెలంగాణ వాణి):
శ్రావణమాసం రెండో శుక్రవారం సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా మహిళలు వరలక్ష్మీ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామునే మహిళలు తలంటు స్నానాలు ఆచరించి, ఇళ్లను శుభ్రం చేసుకుని పూజా సామగ్రిని సిద్ధం చేసుకున్నారు. అనంతరం వరలక్ష్మీ దేవిని ప్రత్యేకంగా అలంకరించి పసుపు, కుంకుమ, పూలు, పండ్లు తదితర పూజా సామగ్రితో ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. వ్రతం సందర్భంగా మహిళలు భక్తిశ్రద్ధలతో అమ్మవారిని పూజిస్తూ తమ కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, అష్టైశ్వర్యాలతో నిండు నూరేళ్లు చల్లగా ఉండాలని ప్రార్థించారు. జిల్లాలోని పలు దేవాలయాల్లోనూ పూజారులు వరలక్ష్మీ అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయాలకు పెద్ద సంఖ్యలో మహిళలు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.
వ్రతం అనంతరం మహిళలు ఒకరికొకరు పసుపు, కుంకుమ, వాయినాలు అందించుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. దీంతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. శ్రావణ శుక్రవారం సందర్భంగా ఆలయాలు, ఇళ్లు భక్తిశ్రద్ధలతో కళకళలాడాయి.

# సర్కారు దవాఖానకు కార్పొరేట్ వైద్యం

### - ఫలించిన ఎమ్మెల్యే కూనంనేని కృషి..

### జీజీహెచ్‌కు రూ.3 కోట్ల నిధులు



కొత్తగూడెం, ఆగస్టు 21 (తెలంగాణ వాణి):
కొత్తగూడెం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి (జీజీహెచ్)లో ఆధునిక వైద్య సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి. ఆస్పత్రి అభివృద్ధి కోసం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కృషితో ప్రభుత్వం రూ.3 కోట్ల నిధులు మంజూరు చేసింది.
ఈ నిధులతో జీజీహెచ్‌లో త్వరలో క్యాథ్ ల్యాబ్, క్రిటికల్ కేర్ యూనిట్ (సీసీయూ), ఎంఆర్ఐ స్కానింగ్ సదుపాయాలతో పాటు 20 పడకల ఐసీయూ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. దీంతో గుండె సంబంధిత అత్యవసర పరిస్థితులు, ఇతర తీవ్ర అనారోగ్య సమస్యలకు స్థానికంగానే మెరుగైన వైద్యం అందే అవకాశం కలుగుతుంది. ఇప్పటివరకు అత్యవసర వైద్యం కోసం ఖమ్మం, హైదరాబాద్ వంటి ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదని, కొత్త సదుపాయాలతో పేద, మధ్యతరగతి ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. ఖరీదైన వైద్య సేవలను ప్రభుత్వ ఆస్పత్రిలోనే అందుబాటులోకి తీసుకురావడం ద్వారా ప్రజలపై ఆర్థిక భారం తగ్గనుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. ఆధునిక ఐసీయూ, ఇతర అత్యవసర వైద్య సేవలతో ప్రభుత్వ ఆస్పత్రిలోనే మెరుగైన వైద్యం అందించేందుకు అవకాశం కలుగుతుందని తెలిపారు. సామాన్య, మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా జీజీహెచ్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు.

# సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు కోల్ ఇండియా వేతనాలు అమలు చేయాలి




### సెప్టెంబర్ 1న సదస్సును జయప్రదం చేయాలి: ఐఎఫ్‌టీయూ నేత సీతారామయ్య

కొత్తగూడెం, ఆగస్టు 21 (తెలంగాణ వాణి):
సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు కోల్ ఇండియా తరహా వేతనాలు, సౌకర్యాలు, హక్కులు అమలు చేయాలని ఐఎఫ్‌టీ యూ రాష్ట్ర నాయకుడు సీతారామయ్య డిమాండ్ చేశారు. దేశంలోని ఇతర బొగ్గు సంస్థల్లో హైపవర్ కమిటీ వేతనాలు అమలు చేస్తున్నప్పటికీ సింగరేణిలో సుమారు 35 వేల మంది కాంట్రాక్టు కార్మికులకు అన్యాయం జరుగుతోందన్నారు. శుక్రవారం కొత్తగూడెం బంగ్లాస్ ఏరియాలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. 2013 జనవరి నుంచి చెల్లించాల్సిన హైపవర్ కమిటీ వేతనాల బకాయిలను వెంటనే చెల్లించాలని, కోల్ ఇండియా తరహాలో బోనస్, సెలవులు, యూనిఫాం తదితర సౌకర్యాలు కల్పించాలని కోరారు. సులభ్ వర్కర్లకు పీఎఫ్‌తో పాటు కనీస వేతనాలు, ఇతర సౌకర్యాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారానికి గుర్తింపు కార్మిక సంఘాలు ఐక్య ఉద్యమానికి ముందుకు రావాలని సీతారామయ్య పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 1న కొత్తగూడెంలోని సీఈఆర్ క్లబ్‌లో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, అసంఘటిత రంగ కార్మికుల సమస్యలపై నిర్వహించే సదస్సు, ప్రదర్శనను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమానికి సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ కొత్తగూడెం రీజియన్ కార్యదర్శి నెమిల్ల సంజీవ్ అధ్యక్షత వహించారు. ఐఎఫ్టీయూ రాష్ట్ర నాయకులు గౌని నాగేశ్వరరావు, శంకర్, సురేష్, రమేష్, వెంకటేశ్వర్లు, రాధా, తార, మంగ, పద్మ, హుస్సేన్, బి.అస్లీ, కాంతి పాల్గొన్నారు.

# కాపు సీతాలక్ష్మి నివాసంలో వైభవంగా వరలక్ష్మీ వ్రతం

### - శ్రావణ మాస పవిత్రతను చాటుతూ భక్తిశ్రద్ధలతో పూజలు



కొత్తగూడెం, ఆగస్టు 21 (తెలంగాణ వాణి):
మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి నివాసంలో శ్రీ వరలక్ష్మీ వ్రత వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. శ్రావణ మాస పవిత్రతను చాటేలా నిర్వహించిన ఈ వేడుకలకు ఇరుగుపొరుగు మహిళలు, బంధువులు, ఆడపడుచులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీ వరలక్ష్మీ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. మహిళలు సంప్రదాయబద్ధంగా ఒకరికొకరు పసుపు, కుంకుమ, వాయినాలు అందించుకుని శుభాకాంక్షలు తెలిపారు. పూలు, పండ్లు సమర్పించి అమ్మవారిని భక్తిశ్రద్ధలతో కొలిచారు. వేడుకల్లో కాపు సీతాలక్ష్మి మనవరాలు మహాలక్ష్మిని ముత్తైదువులు, మహిళలు ఆశీర్వదించారు. చిన్నారి ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, చక్కని విద్యా సంస్కారాలతో నిండు నూరేళ్లు వర్ధిల్లాలని దీవించారు. పూజ అనంతరం మహిళలకు వాయినాలు, తీర్థప్రసాదాలు అందజేశారు. దీంతో నివాసంలో పండుగ వాతావరణం నెలకొంది.

# చెత్తచెదారంతో అంబేద్కర్ కాలనీ రహదారి

### ఈ దారికి మోక్షం ఎప్పుడు? అధికారుల నిర్లక్ష్యమే కారణమా?



జూలూరుపాడు, ఆగస్టు 21 (తెలంగాణ వాణి):
మండల కేంద్రంలోని అంబేద్కర్ కాలనీలో ప్రభుత్వాలు మారుతున్నా ప్రజల కష్టాలు మాత్రం తీరడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రం పక్కన ఉన్న రహదారి వర్షం కురిసిన ప్రతిసారి బురదమయంగా మారడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. వర్షాకాలంలో ఈ రహదారిపై నడవడం కూడా కష్టంగా మారిందని, ముఖ్యంగా చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రానికి తీసుకెళ్లే తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. బురదలో జారిపడి ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.
గత ప్రభుత్వ హయాంలోనే ఈ రహదారికి సీసీ రోడ్డు మంజూరైనప్పటికీ ఇప్పటివరకు పనులు ప్రారంభం కాలేదని, మంజూరైన రోడ్డును మరో ప్రాంతానికి తరలించడంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా తమ రహదారి పరిస్థితి మాత్రం మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారి పరిస్థితిని పరిశీలించి, మంజూరైన సీసీ రోడ్డు పనులను వెంటనే ప్రారంభించాలని అంబేద్కర్ కాలనీ ప్రజలు కోరుతున్నారు. చిన్నారులు, మహిళలు, వృద్ధుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రహదారికి శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు.

# ఏళ్లనాటి విద్యుత్ సమస్యకు తక్షణ పరిష్కారం

### విద్యుత్ స్తంభాల ఏర్పాటు, కల్వర్టు నిర్మాణానికి చర్యలు

### దొంతికుంట చెరువుకు డ్రైనేజీ నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు: జూపల్లి రమేశ్‌బాబు



అశ్వారావుపేట, ఆగస్టు 21 (తెలంగాణ వాణి ప్రతినిధి):
అశ్వారావుపేట మున్సిపాలిటీ 14వ వార్డులో ఏళ్లుగా ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్న విద్యుత్, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేశ్‌బాబు తెలిపారు. 14వ వార్డు కౌన్సిలర్ డాక్టర్ భూక్యా ఉదయ జ్యోతితో కలిసి ఆయన వార్డులో పర్యటించి సమస్యలను పరిశీలిం చారు. విరిగిపోయిన విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్త స్తంభాలను ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. అదేవిధంగా వర్షాకాలంలో నీరు నిలిచిపోయే సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ఇరిగేషన్ శాఖ ఏఈ కిషోర్‌తో చర్చించారు. త్వరలో కల్వర్టు నిర్మాణానికి చర్యలు చేపట్టాలని కోరారు. దొంతికుంట చెరువుకు అనుసంధానంగా ఉన్న లింక్ కాలువల ద్వారా డ్రైనేజీ నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు చేపడుతున్నట్లు జూపల్లి రమేశ్‌బాబు తెలిపారు. వార్డులో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తామని కౌన్సిలర్ డాక్టర్ భూక్యా ఉదయజ్యోతి పేర్కొన్నారు. మండల యువజన నాయకుడు జూపల్లి ప్రమోద్, 10వ వార్డు కౌన్సిలర్ మిండా హరిబాబు, మోర్ల వెంకన్న, బాబీ శ్రీను, మున్సిపల్ సిబ్బంది, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

RNI NO.APTEL/2012/53127 TELANGANA VANI TELUGU DAILY
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక The Voice of Telangana
శనివారం, 22 - 8 -2026

## తల్లాడలో రెండు ఇంటి దొంగతనాల కేసులు.. నిందితుడి అరెస్ట్

### రూ.2.10 లక్షల విలువైన బంగారు ఆభరణాలు స్వాధీనం



**తల్లాడ, ఆగస్టు 21 (తెలంగాణ వాణి):**
తల్లాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన రెండు వేర్వేరు ఇంటి దొంగతనాల కేసుల్లో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి సుమారు రూ.2.10 లక్షల విలువైన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.
పోలీసుల కథనం ప్రకారం.. జంగాల స్వరూప్‌కుమార్ అలియాస్ క్రాంతి స్వరూప్ అలియాస్ వినయ్‌కుమార్ (41) తల్లాడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రెండు ఇళ్లలో చోరీలకు పాల్పడ్డాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం 7.30 గంటల సమయంలో తల్లాడ బస్టాండ్ వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా నిందితుడు పట్టుబడ్డాడు. అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా రెండు చోరీలకు పాల్పడినట్లు అంగీకరించినట్లు పోలీసులు వెల్లడించారు. గంగదేవిపాడు గ్రామానికి చెందిన సిరివేరు నరసింహారావు దంపతులు కూలి పనులకు వెళ్లిన సమయంలో వారి ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలోని బంగారు ఆభరణాలను నిందితుడు అపహరించినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనలకు సంబంధించి తల్లాడ పోలీస్‌స్టేషన్‌లో క్రైం నంబర్ 90/2026, 92/2026, బీఎన్ఎస్ సెక్షన్లు 331(3), 305(ఏ) కింద కేసులు నమోదయ్యాయి. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

**స్వాధీనం చేసుకున్న ఆభరణాలు**
నిందితుడి వద్ద నుంచి బంగారు నెక్లెస్, బుట్టలు (జత), చంప సవరాలు (జత), లక్ష్మీదేవి లాకెట్, వెంకటేశ్వరస్వామి ఉంగరం, జుంకాలు (జత), మాటీలు (జత), లక్ష్మీదేవి ఉంగరం, స్వామి ఉంగరం, చెవి స్టడ్స్ (జత) తదితర 10 రకాల బంగారు వస్తువులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుల దర్యాప్తును తల్లాడ ఎస్సై ఎన్. వెంకటకృష్ణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ప్రజలు ఇళ్లకు తాళాలు వేసి బయటకు వెళ్లే సమయంలో విలువైన వస్తువులను బహిరంగంగా ఉంచకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇంటి నుంచి బయటకు వెళ్లే విషయాన్ని నమ్మకమైన పొరుగువారికి తెలియజేయాలని, ఇళ్ల పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. దొంగతనాల నివారణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## అభివృద్ధి ధ్యేయంగా కల్లూరు మున్సిపాలిటీని తీర్చిదిద్దుతాం

**కల్లూరు, ఆగస్టు 21 (తెలంగాణ వాణి):**




కల్లూరు మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డులో సాయిబాబా గుడి ఎదురుగా ఉన్న రహదారి అభివృద్ధి పనులు చేపట్టడంపై స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత పదేళ్లుగా మున్సిపాలిటీ అభివృద్ధిని పట్టించుకోని గత ప్రభుత్వం హయాంలో సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదని వారు పేర్కొన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం పట్టణ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థతో పాటు మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. కల్లూరు మున్సిపాలిటీ అభివృద్ధికి సుమారు రూ.15 కోట్ల నిధులు కేటాయించడంతో పట్టణ రూపురేఖలు మార్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని నాయకులు తెలిపారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ నేతృత్వంలో కల్లూరు మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ అభివృద్ధి పనులకు నిధులు తీసుకువస్తున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్‌కు స్థానిక ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మున్సిపాలిటీ చైర్మన్ ధారావత్ మోహన్ నాయక్, వైస్ చైర్మన్ శీలం కోటేశ్వరి కృష్ణారెడ్డి, 15వ వార్డు కౌన్సిలర్ యాసా నాగమణి శ్రీకాంత్, కాంగ్రెస్ నాయకులు బొల్లం ఉపేందర్ తదితరులకు ప్రజలు ధన్యవాదాలు తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో మిగిలిన వార్డుల్లోనూ అవసరమైన అభివృద్ధి పనులను దశలవారీగా చేపట్టి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తామని నాయకులు తెలిపారు.

## మొక్కలు నాటుదాం సంరక్షిద్దాం పర్యావరణ సమతుల్యాన్ని కాపాడుకుందాం

**బూర్గంపాడు ఆగస్టు 21 (తెలంగాణ వాణి ప్రతినిధి)**





భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సారపాక గ్రామంలో పచ్చదనాన్ని పెంపొందించడంతో పాటు పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించే లక్ష్యంతో ఐటీసీ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. సారపాక గ్రామ సర్పంచ్ కిషోర్ నాయక్ పాలకవర్గ సభ్యులు, గ్రామ ప్రజల భాగస్వామ్యంతో శుక్రవారం నాడు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గ్రామంలోని ప్రధాన రహదారులకు ఇరువైపులా, అంతర్గత రహదారుల వెంట, ఖాళీ ప్రదేశాలు, గ్రామంలోని వివిధ ప్రాంతాల్లో నీడనిచ్చే, పండ్లను అందించే, పర్యావరణానికి ఉపయోగపడే మొక్కలను నాటుతున్నారు. మొక్క నాటడం మాత్రమే కాదు.. సంరక్షణే ముఖ్యం, ఒక మొక్కను నాటడం మొదటి అడుగు మాత్రమే. దానికి క్రమం తప్పకుండా నీరు అందించడం, పశువుల నుంచి రక్షించడం, అవసరమైనప్పుడు కంచె ఏర్పాటు చేయడం, మొక్క ఎదుగుదలను పర్యవేక్షించడం ద్వారా మాత్రమే నాటిన కార్యక్రమానికి పూర్తి ఫలితం లభిస్తుంది. సారపాకలో ప్రారంభమైన ఈ కార్యక్రమం నిరంతరంగా కొనసాగి, గ్రామం మరింత పచ్చగా మారాలని గ్రామస్థులు ఆకాంక్షిస్తున్నారు. ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షిస్తే పచ్చని గ్రామ నిర్మాణం సాధ్యమవుతుందని సర్పంచ్ కిషోర్ నాయక్, పాలకవర్గ సభ్యులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐటిసి హెచ్‌ఆర్ చెంగల్ రావు, ఎంపీడీవో జమలారెడ్డి, ఈవో రవికుమార్ వివిధ పార్టీల నాయకులు గ్రామ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్మీదేవిపల్లి 'జీపీఎస్ ఏపీ' మోడల్ ప్రణాళిక ఆవిష్కరణ

**- గ్రామాభివృద్ధికి సమగ్ర డిజిటల్ దిక్సూచి: మంత్రి సీతక్క**





**లక్ష్మీదేవిపల్లి, ఆగస్టు 21 (తెలంగాణ వాణి)**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలంలోని లక్ష్మీదేవిపల్లి గ్రామ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక 'జీపీఎస్ ఏపీ' మోడల్‌ను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి సీతక్క డిజిటల్‌గా ఆవిష్కరించారు. రాజేంద్రనగర్‌లోని టీ.జీ.ఐ.ఆర్.డీలో జరిగిన కార్యక్రమంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాకిటి శ్రీహరి, గ్రామ సర్పంచ్ తాటి అనిత తదితరులు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. గ్రామాల సమగ్ర అభివృద్ధికి సాంకేతికతను వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలోని అన్ని గ్రామాల సర్పంచులు, పంచాయతీ అధికారులు, పాలకవర్గ సభ్యులకు ఈ సాఫ్ట్‌వేర్‌పై అవగాహన కల్పించి, ప్రతి గ్రామానికి ఇలాంటి సమగ్ర అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

**29 ప్రభుత్వ శాఖలకు సంబంధించిన సమగ్ర సమాచారం**
లక్ష్మీదేవిపల్లి గ్రామాభివృద్ధికి దిక్సూచిగా నిలిచేలా రూపొందించిన వెబ్‌సైట్‌లో 29 ప్రభుత్వ శాఖలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని పొందుపరిచారు. గ్రామంలో గతంలో చేపట్టిన, ప్రస్తుతం జరుగుతున్న, భవిష్యత్‌లో చేపట్టనున్న అభివృద్ధి పనులతో పాటు సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాలను అందుబాటులో ఉంచారు. త్రాగునీరు, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, రహదారులు, డ్రైనేజీ, విద్య, వైద్యం, వ్యవసాయం, ఉపాధి, జనాభా, అక్షరాస్యతతో పాటు రెవెన్యూ, అటవీ, పరిశ్రమలు, ప్రాజెక్టులు, దేవాదాయ, సామాజిక, భౌగోళిక వివరాలను వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. గ్రామ పంచాయతీ నిధుల సమీకరణ, ఆదాయం, ఖర్చులకు సంబంధించిన వివరాలను కూడా పారదర్శకంగా అందుబాటులో ఉంచినట్లు అధికారులు తెలిపారు. ఈ సమాచారంతో గ్రామ ప్రజలు తమ గ్రామానికి సంబంధించిన అభివృద్ధి, సంక్షేమం, మౌలిక వసతుల వివరాలను సులభంగా తెలుసుకునే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు.

**ఘనంగా సన్మానం**
లక్ష్మీదేవిపల్లి గ్రామ పంచాయతీకి రాష్ట్రస్థాయిలో మోడల్ ప్రణాళికగా గుర్తింపు రావడంతో ఎంపీడీవో జి. సుస్మిత, ఎంపీవో, పంచాయతీ కార్యదర్శి ఏ. సాంబయ్యలను కాంగ్రెస్ నాయకులు పూణెం శ్రీనివాస్, ఉపసర్పంచ్ మహేష్, వార్డు సభ్యులు వాణి,



అఫ్సర్ ఖాన్, అంతడుపుల కృష్ణ శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా పూణెం శ్రీనివాస్ మాట్లాడుతూ.. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆశీస్సులతో కొత్తగూడెం నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ముందుకు సాగుతున్నాయని అన్నారు. లక్ష్మీదేవిపల్లి గ్రామాన్ని మోడల్‌గా ఎంపిక చేసి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తీసుకువచ్చిన మంత్రి సీతక్కకు, ప్రజాపాలన ప్రభుత్వానికి గ్రామ ప్రజలతరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# వృద్ధుల సంరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత






**- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం. రాజేందర్**

**కొత్తగూడెం, ఆగస్టు 21 (తెలంగాణ వాణి):**
వృద్ధుల సంరక్షణ, భద్రత ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం. రాజేందర్ అన్నారు. ప్రపంచ సీనియర్ సిటిజన్స్ డే సందర్భంగా హేమచంద్రాపురం గ్రామంలోని అమ్మానాథాశ్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సీనియర్ సిటిజన్లకు న్యాయ అవగాహన కార్యక్రమంతో పాటు ఉచిత వైద్య ఆరోగ్య పరీక్షల శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం. రాజేందర్ మాట్లాడుతూ.. సీనియర్ సిటిజన్లు సమాజానికి అందించిన సేవలు, వారి అనుభవం ఎంతో విలువైనవని అన్నారు. వృద్ధుల పట్ల ప్రతి ఒక్కరూ గౌరవం, ప్రేమ, బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. సీనియర్ సిటిజన్లు తమ హక్కులను తెలుసుకోవడంతో పాటు అవసరమైనప్పుడు అందుబాటులో ఉన్న న్యాయ సహాయాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. వృద్ధుల సంరక్షణ, భద్రత, గౌరవప్రదమైన జీవనం కోసం చట్టపరమైన రక్షణలు ఉన్నాయని, అర్హులకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం అందుతుందని వివరించారు.
డీఎంహెచ్‌ఓ డాక్టర్ తుకారాం రాథోడ్ మాట్లాడుతూ.. వయస్సు పెరిగే కొద్దీ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరమన్నారు. సీనియర్ సిటిజన్లు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, కంటి చూపు, రక్తపోటు, మధుమేహం వంటి సమస్యలను నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. సరైన ఆహారం, ఆరోగ్యకరమైన జీవనశైలి, వైద్యుల సూచనలు పాటిస్తే వృద్ధాప్యంలోనూ ఆరోగ్యంగా ఉండవచ్చని తెలిపారు.
వైద్య శిబిరంలో సీనియర్ సిటిజన్లకు కంటి పరీక్షలు, సాధారణ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి వైద్య సలహాలు, మందులు అందించారు. తదుపరి చికిత్సకు సంబంధించిన సూచనలు కూడా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ దీపిక, తిరుమలరావు, స్వప్న శ్రావణి, లక్ష్మి, దేవా, ఏఎన్‌ఎంలు, ల్యాబ్ టెక్నీషియన్లు, న్యాయవాది మెండు రాజమల్లు, హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు సుధాకర్‌రావు, అమ్మానాథాశ్రమం నిర్వాహకులు హిమతేజ తదితరులు పాల్గొన్నారు.

## జూపల్లి దంపతుల ఆధ్వర్యంలో ఘనంగా వరలక్ష్మీ వ్రత వేడుకలు



**అశ్వారావుపేట, ఆగస్టు 21 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
అశ్వారావుపేట మున్సిపాలిటీ చైర్‌పర్సన్ జూపల్లి శశికళమ్మ, వైస్ చైర్మన్ జూపల్లి రమేష్‌బాబు దంపతుల నివాసంలో వరలక్ష్మీ వ్రత వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. శ్రావణ మాస పవిత్రతను చాటేలా నిర్వహించిన ఈ వేడుకల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ మహిళా సిబ్బందికి జూపల్లి శశికళమ్మ, జూపల్లి రమేష్ బాబు దంపతులు చీరలు, పసుపు, కుంకుమలను అందజేశారు. అనంతరం మహిళా సిబ్బందికి అల్పాహారం ఏర్పాటు చేసి, వారితో కలిసి ఆత్మీయంగా వరలక్ష్మీ వ్రత వేడుకల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొని మహిళా సిబ్బందికి వరలక్ష్మీ వ్రత శుభాకాంక్షలు తెలిపారు. భక్తిశ్రద్ధలతో సాగిన పూజా కార్యక్రమాలతో ఆ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.
జూపల్లి దంపతుల ఆధ్వర్యంలో మున్సిపాలిటీ మహిళా సిబ్బందిని ఆత్మీయంగా గౌరవిస్తూ నిర్వహించిన ఈ వేడుకలు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. శ్రీ వరలక్ష్మీ అమ్మవారి ఆశీస్సులతో ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలు వెల్లివిరియాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పలువురు పెద్దలు పాల్గొన్నారు.

# అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవాలి

**- ఎన్డీపీఎస్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలి: జిల్లా ఎస్పీ రోహిత్ రాజు**





**అశ్వారావుపేట, ఆగస్టు 21 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై నిరంతరం నిఘా ఉంచి కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ పోలీసు అధికారులను ఆదేశించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా శుక్రవారం అశ్వారావుపేట పోలీస్‌స్టేషన్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించిన ఎస్పీ.. పోలీస్‌స్టేషన్ పరిసరాలు, సిబ్బంది కిట్ ఆర్టికల్స్‌ను పరిశీలించారు. స్టేషన్‌ను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు సమస్యలతో వచ్చే బాధితులతో మర్యాదగా వ్యవహరించి, వారికి సత్వర న్యాయం అందేలా విధులు నిర్వర్తించాలని సూచించారు. పేకాట, కోడిపందాలు, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న దొంగతనం కేసులను త్వరగా పరిష్కరించి, నిందితులను అరెస్ట్ చేయడంతో పాటు చోరీకి గురైన ఆస్తి రికవరీపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణాకు పాల్పడే వ్యక్తులను గుర్తించి ఎన్డీపీఎస్ కేసులపై ప్రత్యేక దృష్టి సారిస్తూ కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సీసీటీఎన్ఎస్ 2.0లో కేసుల వివరాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని, ఈ-సాక్ష్య, నాట్‌గ్రిడ్, గాంధీవ వంటి ఆధునిక సాంకేతిక వ్యవస్థలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని తెలిపారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, పెట్రోలింగ్, బ్లూకోల్ట్స్ వాహనాలతో నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. డయల్-112కు సమాచారం అందిన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులకు తక్షణ సహాయం అందించాలని ఆదేశించారు. అనంతరం పోలీస్ సిబ్బంది సమస్యలను ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా పోలీస్‌స్టేషన్ ఆవరణలో అధికారులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పాల్వంచ డీఎస్పీ ఆర్. సతీష్‌కుమార్ ఎస్పీ రోహిత్ రాజును శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో డీఎస్పీ ఆర్. సతీష్‌కుమార్, సీఐ నాగరాజు, ఎస్సైలు యయాతిరాజు, రాజేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## అక్రమంగా తరలిస్తున్న 84 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

**హసన్‌పర్తి, ఆగస్టు 21 తెలంగాణ వాణి ప్రతినిధి**
హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా తరలిస్తున్న 84 క్వింటాళ్ల పీడీఎస్ రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నల్లగట్టు గుట్ట వై జంక్షన్ వద్ద రెండు ఆటో ట్రాలీలను తనిఖీ చేయగా 200 బస్తాల బియ్యం పట్టుబడింది. వీటి విలువ సుమారు రూ.2.94 లక్షలుగా పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో ఆటో డ్రైవర్లు ఒర్సు భాను, సిరిగిరి సంపత్‌లను అరెస్ట్ చేసి, రెండు ఆటో ట్రాలీలను స్వాధీనం చేసుకున్నారు. చిత్తారి కోటిలింగం సూచనల మేరకు గ్రామాల నుంచి కిలో రూ.15కు కొనుగోలు చేసి రూ.35కు విక్రయించేందుకు తరలిస్తున్నట్లు విచారణలో వెల్లడైందని పోలీసులు తెలిపారు. ఇద్దరు నిందితులతో పాటు పరారీలో ఉన్న కోటిలింగంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# పీఎంహెచ్ బాయ్స్ హాస్టల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే



**టేకులపల్లి, ఆగస్టు 21 (తెలంగాణ వాణి):**
టేకులపల్లి మండలం గోలియాతండ గ్రామపంచాయతీ పరిధిలోని పీఎంహెచ్ బాయ్స్ హాస్టల్‌ను ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.
ఈ సందర్భంగా హాస్టల్ గదులు, పరిసరాలను పరిశీలించిన ఎమ్మెల్యే విద్యార్థులతో మాట్లాడి వారికి అందుతున్న సౌకర్యాలు, సమస్యలు, చదువుకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. తనిఖీ సమయంలో హాస్టల్ వార్డెన్ విధులకు గైర్హాజరై అందుబాటులో లేకపోవడంపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల సంక్షేమం, వసతి విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో టేకులపల్లి ఎస్ఐ తిరుపతి, ఆత్మ కమిటీ చైర్మన్ బోడ మంగీలాల్ నాయక్, కాంగ్రెస్ నాయకులు మూడ్ శ్రీను, జాటోత్ రవీందర్, పోలీసు సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



## మహాత్మానగర్‌లో ఘనంగా లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు

**తిమ్మాపూర్, ఆగస్టు 21 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
తిమ్మాపూర్ మండలం మహాత్మానగర్‌లోని స్వయంభు శ్రీ తాపాల లక్ష్మీనరసింహ స్వామి 22వ అధ్యయన బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుంచి 28వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. ప్రధాన అర్చకులు తిరునగరి వెంకటాద్రి స్వామి ఆధ్వర్యంలో ఉత్సవాలు జరుగనున్నాయి. తొలిరోజు విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహ వాచనం, అంకురార్పణ, అగ్నిప్రతిష్ఠ నిర్వహించనున్నారు. 25న అఖండ భగవన్నామ సంకీర్తన, 26న మధ్యాహ్నం 12.15 గంటలకు తిరుకల్యాణ మహోత్సవం, అనంతరం అన్నదానం జరుగుతుంది. 27న సుదర్శన నరసింహ హోమం, 28న మహా పూర్ణాహుతి, చక్రస్నానం, పుష్పయాగం నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని ఆలయ నిర్వాహకులు కోరారు.

RNI NO APTEL/2012/53127 TELANGANA VANI TELUGU DAILY

తెలంగాణ వాణి

తెలుగు దినపత్రిక The Voice of Telangana

శనివారం , 22 - 8 -2026

# జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో మర్కల్ గురుకుల విద్యార్థినుల ప్రతిభ

**11 పతకాలు సాధించి సత్తా.. రాష్ట్రస్థాయి పోటీలకు ముగ్గురు ఎంపిక**




**ఎల్లారెడ్డి, ఆగస్టు 21 (తెలంగాణ వాణి ప్రతినిధి)**

కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం మర్కల్ గ్రామంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో సత్తా చాటారు. కామారెడ్డి జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో విద్యార్థినులు మొత్తం 11 పతకాలు సాధించారు.విద్యార్థినుల ప్రతిభలో 4 స్వర్ణ, 4 రజత, 3 కాంస్య పతకాలు ఉన్నాయి. ఎం.బి.ఏ ప్రథమ సంవత్సరం విద్యార్థిని ఎం.బి. రజిత షాట్‌పుట్‌లో రజత పతకం, స్వప్న జావెలిన్ త్రోలో కాంస్య పతకం సాధించారు. ఎస్. సంజీవని 100 మీటర్ల పరుగులో స్వర్ణ పతకం, కె. దివ్య 100 మీటర్ల పరుగులో రజత పతకం సాధించారు. సీహెచ్. శిరీష 400 మీటర్ల పరుగులో రజతం, సీహెచ్. వైష్ణవి డిస్కస్ త్రోలో స్వర్ణం, బి. నవ్యశ్రీ జావెలిన్ త్రోలో స్వర్ణం, ఎం. గోపిక జావెలిన్ త్రోలో రజతం, బి. ప్రహర్ష లాంగ్‌జంప్‌లో స్వర్ణం, టీ. అరుణ షాట్‌పుట్‌లో కాంస్య పతకం సాధించారు. ఎం. సరిత కూడా యు-20 విభాగంలో రజత పతకం సాధించింది. కాగా సీహెచ్. వైష్ణవి, బి. నవ్యశ్రీ, ఎస్. సంజీవని రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థినుల ప్రతిభను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి. శోభారాణి, వైస్ ప్రిన్సిపల్ ఎస్. కృష్ణవేణి, ఫిజికల్ డైరెక్టర్ రమాదేవి, అధ్యాపక బృందం అభినందించారు. రాష్ట్రస్థాయిలోనూ ఇదే ప్రతిభను కనబరిచి కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# గాయత్రి ఆసుపత్రిని తనిఖీ చేసిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు



**పెద్ద శంకరం పేట , ఆగస్టు,21, (తెలంగాణ వాణి):**

పెద్ద శంకరంపేట లోని శ్రీ గాయత్రీ ఆసుపత్రిని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్‌ఓ) డాక్టర్ గణేశ్వర్ శుక్రవారం వైద్య సిబ్బందితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, రోగుల రికార్డులు, సిబ్బంది విద్యార్హత ధ్రువ పత్రాలు, వైద్య పరికరాలు, ఆపరేషన్ థియేటర్, అగ్నిమాపక భద్రతా ఏర్పాట్లు, బయో మెడికల్ వ్యర్థాల నిర్వహణ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆసుపత్రిలో పీసీపీఎన్‌డీటీ చట్టంపై అవగాహన పోస్టర్లు ఏర్పాటు చేయాలని, ఎక్స్‌రే గది వద్ద ఆరోగ్య భద్రతా సూచనలు స్పష్టంగా ప్రదర్శించాలని డీఎంహెచ్‌ఓ సూచించారు. రోగుల వివరాలు, వైద్య రికార్డులు, పరీక్షా నివేదికలను తప్పని సరిగా ఆన్‌లైన్ లో నమోదు చేయాలని ఆదేశించారు.వైద్యులు, సిబ్బంది విద్యార్హత ధ్రువ పత్రాలను అందుబాటులో ఉంచాలని, ఆపరేషన్ థియేటర్ ను పరిశుభ్రంగా, ఇన్‌ఫెక్షన్ రహితంగా నిర్వహించాలని సూచించారు. రోగులకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పిస్తూ నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఆసుపత్రి యాజమాన్యానికి డీఎంహెచ్‌ఓ డాక్టర్ గణేశ్వర్ సూచించారు. గాయత్రీ ఆసుపత్రిలో రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గణేశ్వర్, ఇతర అధికారులు. పాల్గొన్నారు.

# పెండింగ్ భూసేకరణను వేగవంతంగా పూర్తి చేయాలి : మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి







**కరీంనగర్:ఆగస్టు 21 (తెలంగాణ వాణి ప్రతినిది)**

రాష్ట్రంలో నీటిపారుదల ప్రాజెక్టుల పరిధిలో పెండింగ్ లో ఉన్న భూసేకరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.నీటి పారుదల ప్రాజెక్టుల పరిధిలో పెండింగ్ భూసేక రణపై రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి శుక్రవారం ఉదయం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు,నీటి పారుదల శాఖ అధికారుల తో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ నీటిపారుదల ప్రాజెక్టుల పనులు సకాలంలో పూర్తయ్యేందుకు పెండింగ్ భూసేకరణను పూర్తి చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు.పెండింగ్ భూసేకరణ కోసం ప్రభుత్వం వెంటనే రూ.2,800 కోట్లు ప్రభుత్వం విడుదల చేసిందని పేర్కొన్నారు.

కొత్త ఆయకట్టు సృష్టించేందుకు వీలుగా పెండింగ్ భూసేకరణ, పునరావాస పనులను వేగవంతంగా పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు.భూసేకరణకు అవసరమైన నిధులు అందుబాటులో ఉన్నందున ఎక్కడా జాప్యం లేకుండా ప్రక్రియను పూర్తి చేసి ప్రాజెక్టుల పనులకు ఎలాంటి ఆటంకం కలగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు సూచించారు.నిర్వాసితులకు నిబంధనల ప్రకారం పరిహారం చెల్లించాలని ఆదేశించారు.

**పెండింగ్ భూ సేకరణ పనులు పూర్తి చేయాలి**

జిల్లాలో వివిధ ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్ భూ సేకరణ పనులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు.ఈ మేరకు అధికారులు ప్రణాళిక ప్రకారం ఆయా పనులు పూర్తి చేయాలని సూచించారు.ఏ ఏ ప్రాజెక్టుకు సంబంధించి భూ సేకరణ చేపట్టవలసి ఉంది.. ఎప్పుడు పూర్తవుతాయి.. అన్న వివరాలు అడిగి తెలుసుకున్నారు సత్వరమే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ శ్రీనివాస్ రెడ్డి ఆర్డీవో షర్మిల ఎస్డీసీ రాజేశ్వరి,ఇరిగేషన్ అధికారులు భూ సేకరణ విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల ఇళ్ల స్థలాల పిటిషన్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలి



**- హుజూరాబాద్‌లో ఆరో రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు**

**- బీజేపీ సంపూర్ణ మద్దతు**

**హుజూరాబాద్, ఆగస్టు 21 (తెలంగాణ వాణి):**

జర్నలిస్టుల ఇళ్ల స్థలాలకు సంబంధించిన పిటిషన్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని బీజేపీ హుజూరాబాద్ పట్టణ అధ్యక్షుడు తూర్పాటి రాజు డిమాండ్ చేశారు. హుజూరాబాద్ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం ఆరో రోజుకు చేరుకున్నాయి. దీక్షా శిబిరాన్ని బీజేపీ నాయకులు సందర్శించి సంపూర్ణ మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా తూర్పాటి రాజు మాట్లాడుతూ.. గతంలో అర్హులైన 52 మంది జర్నలిస్టులకు కేటాయించిన ఇళ్ల స్థలాల పట్టాలను అడ్డుకునే ప్రయత్నాలు చేయడం సరికాదన్నారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాలపై గూడూరు స్వామిరెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను బేషరతుగా ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.ప్రజా సమస్యలపై నిరంతరం గళమెత్తే జర్నలిస్టుల న్యాయమైన హక్కులకు బీజేపీ అండగా ఉంటుందని తెలిపారు. అధికారం శాశ్వతం కాదని, జర్నలిస్టుల సమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. సమస్యను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లేందుకు చర్యలు చేపడతామని పేర్కొన్నారు.జర్నలిస్టుల కుటుంబాలకు న్యాయం జరిగే వరకు బీజేపీ అండగా ఉంటుందని తూర్పాటి రాజు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పోతుల సంజీవ్, గంగిశెట్టి రాజు, రావుల వేణు, తిప్పబత్తిని రాజు, గంగిశెట్టి ప్రభాకర్ తదితరులతో పాటు ప్రెస్‌క్లబ్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

# ఆటో కార్మికుల హక్కులకై సమరభేరి

**పెద్దపల్లి కలెక్టరేట్ వద్ద మార్మోగిన నిరసన**

**ఆటో ర్యాలీకి వ్యాల్ల హరీష్‌రెడ్డి నేతృత్వం**

**పెద్దపల్లి, ఆగస్టు 21 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి):**




ఆటో కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర ఆటో యూనియన్ జేఏసీ పిలుపు మేరకు గోదావరిఖనిలో భారీ ఆటో ర్యాలీ, చలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహించారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు వ్యాల్ల హరీష్‌రెడ్డి నేతృత్వంలో జరిగిన ర్యాలీలో పెద్ద సంఖ్యలో ఆటో కార్మికులు పాల్గొన్నారు.గోదావరిఖని చౌరస్తా వద్ద హరీష్‌రెడ్డి, ఆటో యూనియన్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు మంద రవికుమార్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం కలెక్టరేట్ చేరుకుని కార్మికుల సమస్యలపై కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా హరీష్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు, నెలకు రూ.12 వేల జీవనభృతి, ఆటోనగర్ల ఏర్పాటు వంటి హామీలను ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉచిత బస్సు ప్రయాణం కారణంగా ఆటో కార్మికుల ఉపాధి దెబ్బతిన్నదని పేర్కొన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే ఈ నెల 24 నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక బంద్ చేపడతామని హెచ్చరించారు.

ఆటో ప్రమాదాల్లో మృతిచెందిన కుటుంబాలకు నష్టపరిహారం, ఏటా రూ.1,000 కోట్లతో ఆటో కార్పొరేషన్ ఏర్పాటు, ప్రత్యేక బీమా, టూ వీలర్ ట్యాక్సీల నియంత్రణ, 50 ఏళ్లు దాటిన డ్రైవర్లకు నెలకు రూ.10 వేల పెన్షన్, ఫైనాన్షియర్ల వేధింపుల నివారణ తదితర డిమాండ్లను పరిష్కరించాలని కోరారు.కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జాహిద్ పాషా, పోలాడి శ్రీనివాసరావు, బూరుగు వంశీకృష్ణతో పాటు ఆటో జేఏసీ నాయకులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విశ్వసనీయ వార్తలతోనే ప్రజాస్వామ్యం బలోపేతం




**జెన్ జీ పై సోషల్ మీడియా ప్రభావం అధికంగా ఉన్న నేపథ్యంలో యువతకు వాస్తవ, విశ్వసనీయ సమాచారాన్ని అందించాలి**

**సంచలనాత్మకత, వైరల్ కంటెంట్ కంటే విశ్వసనీయత, నైతిక ప్రమాణా లకు మీడియా ప్రాధాన్యం ఇవ్వాలి**

**ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్ జాతీయ సదస్సు ప్రారంభ కార్యక్రమంలో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా**

**హైదరాబాద్:ఆగస్టు 21 (తెలంగాణ వాణి ప్రతినిది)**

డిజిటల్ యుగంలో వేగం కంటే వార్తలో వాస్తవికత, నిష్పక్షపాతం,విశ్వసనీయ తే అత్యంత ముఖ్యమని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు."ముందు నిజ నిర్ధారణ చేయాలి.ఆ తర్వాతే వార్తను ప్రసారం చేయాలి" అని ఆయన జర్నలిస్టులకు సూచిం చారు.హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం బంజారా హిల్స్ తాజ్ కృష్ణ లో నిర్వహిస్తున్న ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్ తొలి జాతీయ సదస్సును గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ప్రారంభించారు.దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రెస్ క్లబ్‌ల ప్రతిని ధులకు స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా గవర్నర్ ప్రెస్ క్లబ్స్ ప్రతినిధులు జర్నలిస్టులను ఉద్దేశించి మాట్లాడారు.మీడియా ప్రజాస్వామ్యానికి నాలుగో స్థంభం మాత్రమే కాదని, సమాజానికి కళ్లు,చెవులు, ప్రజల గొంతుక అని గవర్నర్ పేర్కొన్నారు.దేశవ్యాప్తంగా జర్నలిస్టులను ఒకే వేదికపైకి తీసుకురావడం అభినందనీ యమన్నారు.జర్నలిస్టుల సంక్షేమం,సామాజిక భద్రత, వృత్తిపరమైన అభివృద్ధికి ఫెడరేషన్ దోహదపడాలని ఆకాంక్షించారు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా అనలిటిక్స్ వంటి సాంకేతిక పరిజ్ఞానాలు జర్నలిజానికి కొత్త అవకాశా లను కల్పిస్తున్నాయని,అదే సమయంలో డీప్‌ఫేక్స్,ఏఐ రూపొందించిన వీడియోలు, తప్పుడు సమాచారంతో కొత్త సవాళ్లు ఎదురవుతు న్నాయని తెలిపారు.సోషల్ మీడియా ద్వారా సమాచా రం వేగంగా వ్యాప్తి చెందు తున్న నేపథ్యంలో జర్నలిస్టు ల బాధ్యత మరింత పెరిగిందన్నారు. సోషల్ మీడియా ప్రభావం తో జెన్--జీ ఆలోచనా విధానం మారుతోంది -- యువతకు వాస్తవ,విశ్వ సనీయ సమాచారాన్ని అందించడంలో జర్నలిస్టుల పాత్ర కీలకం అన్నారు.వేగం కంటే వాస్తవ నిర్ధారణ ముఖ్యం అని పేర్కొన్న గవర్నర్ సోషల్ మీడియా ట్రెండ్స్,ఫేక్ న్యూస్‌కు లోనుకాకుండా ప్రజా ప్రయోజనమే లక్ష్యంగా వార్తలు అం దించాలనీ జర్నలిస్టులను కోరారు. సంచలనాత్మకత,వైరల్ కంటెంట్ కంటే విశ్వసనీయ త,నైతిక ప్రమాణాలకు మీడియా ప్రాధాన్యం ఇవ్వాలన్నారు.

ఫేక్ న్యూస్‌ను ఎదుర్కొనేం దుకు డిజిటల్ లిటరసీ,ఏఐ లిటరసీ,ఫ్యాక్ట్ చెకింగ్ వంటి అంశాలపై ఫెడరేషన్ అవ గాహన పెంచాలని సూచించారు.తప్పుడు సమాచారాన్ని అరికట్టడం ప్రభుత్వం ఒక్కదాని బాధ్యత మాత్రమే కాదని, మీడియా,సాంకేతిక సంస్థలు,పౌరులందరి సమష్టి బాధ్యత అని స్పష్టం చేశారు.'నశా ముక్త్ భారత్',టీబీ ముక్త్ భారత్'వంటి జాతీయ కార్యక్రమాలను ప్రజా ఉద్యమాలుగా మలచడంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషించాలని గవ ర్నర్ పిలుపునిచ్చారు. తమ రచనలు,వార్తా సంస్థలు, డిజిటల్ వేదికల ద్వారా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని జర్నలిస్టులను కోరారు. ఫెడరేషన్ రాజకీయా లకు అతీతంగా సమ్మిళిత, ప్రజాస్వామ్య వేదికగా ఎదగా లని గవర్నర్ ఆకాంక్షించారు.జాతీయ సదస్సు భారతీయ జర్నలిజాన్ని మరింత బలోపేతం చేసి, విశ్వసనీ యంగా ,ప్రజా ప్రయోజనాలకు అనుగుణంగా తీర్చిదిద్దే దిశగా దోహదపడాలని ఆయన ఆకాంక్షించారు.

కార్యక్రమంలో తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి,గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.దానకిశోర్,హైదరాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఎస్. విజయ్ కుమార్ రెడ్డి,ప్రధాన కార్యదర్శి వి.రమేష్'ద హిందూ'గ్రూప్ పబ్లిషింగ్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ ఎన్.రామ్,ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్ అధ్యక్షుడు గౌతమ్ లాహిరీ, తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ టీచర్ల ఆందోళనకు బీజేపీ మద్దతు




**వనపర్తి: ఆగస్టు 21,(తెలంగాణ వాణి ప్రతినిధి)**

ప్రిన్సిపాల్ రూపారెడ్డి హత్యకు నిరసనగా వనపర్తి జిల్లా కేంద్రంలో ప్రైవేట్ టీచర్లు చేపట్టిన నిరసన కార్యక్రమానికి బీజేపీ మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, జిల్లా అధ్యక్షులు డి. నారాయణ మాజీ జడ్పీ చైర్మన్ లోకనాథ్ రెడ్డి మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా వారు ప్రైవేట్ టీచర్ల ఆందోళనకు సంఘీభావం ప్రకటించారు. రూపారెడ్డి హత్య ఘటనపై సమగ్ర విచారణ జరిపి, ఘటనకు బాధ్యులైన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు.ప్రైవేట్ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు భద్రత కల్పించడంతో పాటు, భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకోవాలని కోరారు.న్యాయం జరిగే వరకు వారి పోరాటానికి బీజేపీ అండగా ఉంటుందని తెలిపారు.

# కాంగ్రెస్ సీనియర్ నేత ఎస్ఎల్ గౌడ్ కన్నుమూత

**ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ దిగ్భ్రాంతి**

**తిమ్మాపూర్, ఆగస్టు 21 (తెలంగాణ వాణి ప్రతినిధి):**



తిమ్మాపూర్ మండలం మన్నెంపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు సుధాగోని లక్ష్మీనారాయణ గౌడ్ (ఎస్ఎల్ గౌడ్) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయనకు ఛాతిలో నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించడంతో మన్నెంపల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఎస్-ఎల్ గౌడ్ మృతి పట్ల మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గౌడ్ మృతి కాంగ్రెస్ పార్టీకి, వ్యక్తిగతంగా తనకు తీరని లోటని పేర్కొంటూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

# మాజీ వాటర్‌మ్యాన్‌కు కేఆర్ఆర్ ఫౌండేషన్ అండ



**రాజపేట ఆగస్టు:21(తెలంగాణ వాణి విలేకరి)**

మండలంలోని చల్లూరు గ్రామానికి 25 ఏళ్లపాటు వాటర్‌మ్యాన్‌గా సేవలందించిన కూతురు యాదగిరి అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న కేఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ కంచర్ల రామచంద్రారెడ్డి మానవతా దృక్పథంతో స్పందించారు. శుక్రవారం యాదగిరిని పరామర్శించి వైద్య ఖర్చుల కోసం రూ.5 వేల ఆర్థిక సాయాన్ని అం దజేశారు. త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతోఉండాలని ఆకాంక్షించారు. ఆపదలో ఉన్నవారికి అండగా గ్రామంతో తనకున్న అనుబంధంతో ఆపదలో ఉన్న పేదలకు తనవంతు సహాయం అందిస్తున్నానని రామచంద్రారెడ్డి తెలిపారు. సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ బింగి శ్రీనివాస్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

# మహాత్మానగర్‌లో ఘనంగా లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు

**తిమ్మాపూర్, ఆగస్టు 21 (తెలంగాణ వాణి ప్రతినిధి):**

తిమ్మాపూర్ మండలం మహాత్మానగర్‌లోని స్వయంభు శ్రీ తాపాల లక్ష్మీనరసింహ స్వామి 22వ అధ్యయన బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుంచి 28వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. ప్రధాన అర్చకులు తిరునగరి వెంకటాద్రి స్వామి ఆధ్వర్యంలో ఉత్సవాలు జరుగనున్నాయి.తొలిరోజు విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, అంకురార్పణ, అగ్నిప్రతిష్ఠ నిర్వహించనున్నారు. 25న అఖండ భగవన్నామ సంకీర్తన, 26న మధ్యాహ్నం 12.15 గంటలకు తిరుకల్యాణ మహోత్సవం, అనంతరం అన్నదానం జరుగుతుంది. 27న సుదర్శన నరసింహ హోమం, 28న మహాపూర్ణాహుతి, చక్రస్నానం, పుష్పయాగం నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని ఆలయ నిర్వాహకులు కోరారు.